# సాంకేతిక పరిజ్ఞానంతో రైతులకు సేవలు

## న్యూఢిల్లీ మీడియా ల్యాబ్ ఎండీ రామానుజం



సోమారంలో వరిని పరిశీలిస్తున్న రామానుజం

**నేరేడుచర్ల:** సాంకేతిక పరిజ్ఞానంతో రైతులకు అన్నివిధాలా సహకారం అందిస్తూ సేవే లక్ష్యంగా 'అన్నపూర్ణ' పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు న్యూఢిల్లీ మీడియా ల్యాబ్ ఎండీ రామానుజం అన్నారు. సోమవారం మండలంలోని సోమారం పంచాయతీ పరిధిలో వ్యవసాయశాఖ నేతృత్వంలో ఐసీటీ ఇన్‌అగ్రికల్చర్ ప్రాజెక్టు, మీడియా ల్యాబ్ ఆసియా, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ, ముద్ర ఇనిస్టిట్యూట్ ఆఫ్ కమ్యూనికేషన్ సంస్థల భాగస్వామ్యంతో రైతులకు ముఖాముఖి ఏర్పాటుచేశారు. అన్నపూర్ణ పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార కమ్యూనికేషన్‌టెక్నాలజీ ఉపయోగించి మొబైల్ ఫోన్ ద్వారా రైతులకు విలువైన సలహాలు, సమాచారం అందించడమే అన్నపూర్ణ లక్ష్యమని వెల్లడించారు. టోల్‌ఫ్రీ నెంబర్‌తో ఉచితంగా సమాచారం పొందవచ్చన్నారు. ఈ పథకాన్ని వ్యవసాయం, చేపల పెంపకం, పాడి పరిశ్రమలతో పాటు 26ప్రాజెక్టులను అధ్యయనం చేసి 12 రాష్ట్రాలలో 57ఎంపిక చేసిన గ్రామాల్లో 1381 మంది రైతులను సర్వే చేసి వారి వ్యవసాయ సంబంధిత అవసరాలకు అనుగుణంగా రైతులను ఎంపిక చేసి సలహాలు ఇస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా సోమారం గ్రామాన్ని ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రైతుల వివరాలు సేకరించి, మట్టి నమూనాలను పరీక్ష చేసి వారు సాగుచేస్తున్న పంటల వివరాలను కంప్యూటర్‌లో పొందు పరుస్తున్నట్లు తెలిపారు. రైతులనుంచి సేకరించిన సమస్యలు, సలహాలను కంప్యూటర్ల ద్వారా పొందుపరిచి శాస్త్రవేత్తల సలహాల మేరకు వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పరచనున్నట్లు చెప్పారు. గ్రామాల్లో ప్రయోగాత్మకంగా చేపడుతున్న ఈ పథకాన్ని విజయవంతమైతే ప్రభుత్వసహకారంతో దేశవ్యాప్తంగా ప్రవేశపెట్టి అమలు చేస్తామన్నారు. సమావేశంలో మిర్యాలగూడ ఏడీఏ శ్రీధర్‌రెడ్డి, విస్తరణాధికారి చంద్రయ్య, ప్రొ.ఆర్‌ఆర్ రెహ్మాన్, వ్యవసా య విశ్వవిద్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ డా.పి. పున్నారావు, అనురాధ, ప్రకాశ్, వీఆర్వో రంగారావు పాల్గొన్నారు.

# వృద్ధులు, వితంతువులను మోసంచేస్తున్న కాంగ్రెస్

## ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

**సూర్యాపేటసిటీ:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎనిమిదేళ్లుగా వృద్ధులు, వితంతువులను మోసం చేస్తుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆరోపించారు. సోమవారం స్థానిక ఏఎంఆర్ ఫంక్షన్‌హాలులో జరిగిన వృద్ధుల, వితంతువుల సదస్సులో ఆయన మాట్లాడారు. వృద్ధులకు, వితంతువులకు నెలకు రూ.1000 పింఛన్ ఇవ్వాలని, పింఛన్ సాధించే వరకు పోరాటం ఆపేదిలేదని ఆయన స్పష్టం చేశారు. వృద్ధులు, వితంతువులకు నెలకు కేంద్రప్రభుత్వం రూ.200లకు రాష్ట్ర ప్రభుత్వం రూ.225లు కలిపి పింఛన్ ఇవ్వాల్సి ఉందని అన్నారు. రాష్ట్రప్రభుత్వం ఇవ్వాల్సిన రూ. 225 కాంగ్రెస్ పార్టీ జేబులో వేసుకుంటుందని ఆరోపించారు. ఇటీవల ఎమ్మార్పీఎస్ ఉద్యమ నేపథ్యంలో అక్టోబర్ నుంచి కేం ద్రం ఇచ్చే రూ.200లకు మరో రూ.100 కలిపి ఇవ్వాలని జీవో ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం అమలుచేయడం లేదని అన్నారు. అస్సాం, మేఘాలయ, మిజోరాం, చత్తీస్‌ఘడ్, ఒడిస్సా రాష్ట్రాలు నెలకు రూ. 500లకు పైగా పింఛన్ అందజేస్తున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు బీహార్, మణిపూర్, అరుణాచల్‌ప్రదేశ్ 500పింఛన్ ఇవ్వకుండా మోసం చేస్తున్నాయన్నారు. పింఛన్ రూ.1000కు పెంచితే ఏ కుటుంబంలోనైనా తల్లిదండ్రులను గెంటివేయరని అన్నారు. రాష్ట్రంలో 80లక్షల మంది వృద్ధులు, వితంతువులు ఉన్నారని, మరో 30లక్షల మంది పింఛన్ తీసుకోని వారు ఉన్నారన్నారు. ఎమ్మెల్యేల జీతాలు రూ.45 నుంచి 80వేలకు పెరిగినా వృద్ధులు, వితంతువుల పింఛన్ మాత్రం పెంచడం లేదన్నారు. ఈ విషయాలపై మాట్లాడాల్సిన ప్రతిపక్షాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయన్నారు.

హైద్రాబాద్‌లో డిసెంబర్ 17న జరిగే వృద్ధులు, వితంతువుల సదస్సుతో సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తున్నట్లు వెల్లడించారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బాలెంల కిరణ్, చింతలపాటి చినశ్రీరాములు, ఎర్రవీరస్వామి, బోడ శ్రీరాములు, రమేష్, మాణిక్యరావు, సైదులు, ఎల్లయ్య, వృద్ధులు నాగిరెడ్డి మల్లయ్య, రాయి వెంకయ్య, రాంరెడ్డి, లక్ష్మమ్మ, ఎల్లమ్మ, రమణ, జానమ్మ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణపై తేల్చకుంటే సమరమే

## టీఆర్ఎస్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి

**ఆత్మకూర్(ఎస్):** తెలంగాణపై తేల్చకుంటే సమరమేనని టీఆర్ఎస్ పొలిట్‌బ్యూరో సభ్యుడు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన టీఆర్ఎస్ మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణపై స్పష్టత లేకుండా ఉన్న పార్టీలకు రాబోయే ఎన్నికల్లో డిపాజిట్లు దక్కవని, తెలంగాణ సాధించే వరకు ఉద్యమిస్తామని అన్నారు. ఆంధ్రానాయకులు తెలంగాణపై సవతి తల్లి ప్రేమ చూపుతున్నారని విమర్శించారు. 4 జిల్లాల రాయలసీమకు 4 మెడికల్ కళాశాలలు, 9జిల్లాలు గల ఆంధ్రాకు 7 మెడికల్ కళాశాలలు ఇచ్చిన ప్రభుత్వం 10 జిల్లాలు ఉన్న తెలంగాణకు 56 ఏళ్ల నుంచి ఒక మెడికల్ కళాశాలను మంజూరు చేసిందన్నారు. వేమన యూనివర్సిటీకి రూ.470 కోట్లు మంజూరు చేసి, తెలం గాణ యూనివర్సిటీకి రూ.40 కోట్లు మాత్రమే మంజూరు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. 170 తెలంగాణ గ్రామాలను ముంచి నిర్మించిన నాగార్జునసాగర్ ద్వారా సాగు ఎక్కువగా అయ్యేది ఆంధ్రాప్రాంత భూములని అన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు కాకి కృపాకర్‌రెడ్డి అ ధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు గుంతకం డ్ల జగదీశ్వర్‌రెడ్డి, నాయకులు కాకి దయాకర్‌రెడ్డి, శోభన్‌బాబు, రవికుమార్, రాములు, నర్సింహరావు, వెంకట్‌రెడ్డి, లక్ష్మయ్య, రమేష్, సత్యం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి



విజయలక్ష్మికి నాయకులను పరిచయం చేస్తున్న సంకినేని

# సూర్యాపేటలో వైఎస్ విజయలక్ష్మికి స్వాగతం

**సూర్యాపేట:** హైద్రాబాద్ నుంచి ఖమ్మం బహిరంగ సభకు సోమవారం వెళ్తున్న వైసీపీ గౌరవాధ్యక్షురాలు విజయలక్ష్మి సూర్యాపేటలో మాజీఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వర్‌రావు నివాసంలో కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా సంకినేని వెంకటేశ్వర్‌రావు ఇటీవల వైసీపీలో చేరిన పలువురు నాయకులను ఆమెకు పరిచయం చేశారు. విజయలక్ష్మి వెంట వైసీపీ కేంద్రపాలక మం డలి సభ్యులు వైవీ సుబ్బారెడ్డి, జిట్టా బాలకృష్ణారెడ్డి, నాయకులు గోదల రంగారెడ్డి, కొణతం సత్యనారాయణరెడ్డి, నాగేశ్వర్‌రావు, మాణిక్యమ్మ, రాంబాయమ్మ, లక్ష్మణ్‌రావు, నగేష్, పద్మయ్య, బిక్షం, మమతారెడ్డి, జ్యోతికర్ణాకర్‌తో పాటు పలువురు నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకుడు జటంగి వెంకటేశ్వర్లుయాదవ్ ఆధ్వర్యంలో పలువురు న్యాయవాదులు వైసీపీలో చేరారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

# క్రైస్తవులకు పక్కాగృహాలు

## మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**హుజూర్‌నగర్:** క్రైస్తవులందరికీ ఇళ్లస్థలాలు కేటాయించి పక్కాగృహాలు మంజూరుచేస్తానని గృహ నిర్మాణశాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో క్రిస్టియన్ మతపెద్దలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రిస్టియన్ ఆస్తుల పరిరక్షణకు తనవంతు కృషిచేస్తానన్నారు. మైనార్టీల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులను మంజూరు చేస్తుందన్నారు. చర్చిల ప్రహరీలకు కోటి, కమ్యూనిటీహాల్ నిర్మాణానికి మరో కోటి రూపాయలు మంజూరు చేయించామన్నారు. నియోజకవర్గంలోని 41 చర్చిల్లో మంచినీటి వసతి కల్పించేందుకు ప్రత్యేకంగా బోర్లు మంజూరు చేయించామన్నారు. క్రిస్టియన్లు, మైనార్టీలు ప్రభుత్వానికి అండగా ఉండాల ని కోరారు. సమావేశంలో క్రిస్టియన్ మతపెద్దలు రాజు, చెన్నయ్య, జ్ఞానసుందర్, ఆనూఫ్, తిమ్మారెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, నిజాముద్దీన్, గడ్డిరెడ్డి, యరగాని నాగన్నగౌడ్, మల్లికార్జున్‌రావు పాల్గొన్నారు.



గోదామును పరిశీలిస్తున్న డీఎం వెంకటేశ్వరరావు

## ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే

# రైతులకు చెక్కుల పంపిణీ

## పౌరసరఫరాల కార్పొరేషన్ జిల్లా మేనేజర్ వెంకటేశ్వరరావు

**హుజూర్‌నగర్:** రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే చెక్కులు పంపిణీ చేసేందుకు కృషి చేస్తున్నట్లు సివిల్ సప్లై కార్పొరేషన్ జిల్లా మేనేజర్ వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం పట్టణంలోని మార్కెట్ యార్డులో నూతనంగా నిర్మించిన గోదాంను ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో 12మార్కెట్ యార్డుల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఖరీఫ్‌లో రెండులక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలనే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 1.50లక్షల టన్నుల బీపీటీ ధాన్యం, 50వేల టన్నులు నాన్‌బీపీటీ ధాన్యాన్ని సేకరించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఆహార ఉత్పత్తులకు ఎలాంటి లోటు రాకుండా దృష్టిసారించామన్నారు. జిల్లా వ్యాప్తంగా 110 పరపతి సంఘాలు ఉండగా 20పీఎసీఎస్‌లు ధాన్యం కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చాయన్నారు. కార్యక్రమంలో డీటీసీఎస్ రాజారావు, గోదాం ఇన్‌చార్జి కిషన్‌రావు, మార్కెట్‌యార్డు సూపర్‌వైజర్ శ్రీనివాస్‌రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రెండు లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరణ

## డీఎస్‌వో పద్మనాభరెడ్డి

ప్రభుత్వ పథకాలకు రెండు లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సేకరించేందుకు దృష్టి సారించామని డీఎస్‌వో పద్మనాభరెడ్డి తెలిపారు. సోమవా రం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా బియ్యం నిల్వ చే సేందుకు మార్కెట్‌యార్డుల్లో గోదాంలను సేకరిస్తున్నామన్నారు. ప్రభుత్వం ప్ర యోగాత్మకంగా గోదాములు సేకరించి వాటిల్లో బియ్యం నిల్వలు చేసేందుకు కృ షి చేస్తున్నామన్నారు. ప్రజలకు నాణ్యమైన బియ్యం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. జిల్లా వ్యాప్తంగా బియ్యం నిల్వలకు ఇప్పటివరకు 13 కేం ద్రాలు ఎంపిక చేశామన్నారు. లక్ష 12వేల మెట్రిక్ టన్నుల బియ్యం నిల్వలు చే సేందుకు గోదాంలను సేకరించామన్నారు. సమావేశంలో డీఎం వెంకటేశ్వరరావు, రాజారావు, కిషన్‌రావు పాల్గొన్నారు.